


నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వలసపాకలకు చెందిన కె.కోటేశ్వరరావు సోమవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4,900,మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

స్వర్ణ పతకాలు



సఖినేటిపల్లి: మండలానికి చెందిన బాలలు మేడంకి సుజల, మేడంకి రియాన్ ఇండో-నేపాల్ ఇంటర్నే షనల్ సిరీస్‌లో బంగారు పతకాలు సాధించారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లాకు వస్తున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు ముమ్మిడివరం మండలం గురజాపులంకలో హెలిపాడ్ నిర్మించారు. అక్కడి నుంచి అయినవిల్లి మండలం కొండుకుదురు తొత్తరమూడి వరకూ ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. వివేకానంద వారధి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. లంక గ్రామాల ప్రజలను మాత్రమే లోపలకు అనుమతిస్తున్నారు. సీఎం పర్యటన పూర్తయ్యేంత వరకూ ఇతరులను, ఇతర వాహనాలను లోపలకు అనుమతించరు. పోలీసు బందోబస్తు విస్తృతంగా ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నపూర్ అజయ్ కుమార్, డీఎస్పీ అంబికా ప్రసాద్, ఇతర శాఖల అధికారులతో పాటు ఎంపీ చింతా అనురాధ, ముమ్మిడివరం , పి.గన్నవరం ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కొండేటి చిట్టిబాబు తదితరులు పరిశీలించారు.

స్పందనకు 199 అర్జీలు

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి 199 అర్జీలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) సీహెచ్ సత్తిబాబు, ఐసీడీఎస్ పీడీ జీవీ సత్యవాణి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ, స్పందనకు మెరుగైన ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలపై తక్షణమే స్పందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పూర్తిగా విచారించి, ఫొటోలతో సహా నివేదికలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, అర్జీదారులు సంతృప్తి చెందేలా పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా పాల్గొన్నారు.

పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 25 ఫిర్యాదులు

అమలాపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 25 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది అర్జీదారులు చెప్పిన ప్రతీ సమస్యపై ఎస్పీ స్పందించారు. ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో అక్కడి నుంచే మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు.

ఆ బావుల్లో గ్యాస్ వెలికితీత నిలిపివేత

న్యూఢిల్లీ: కేజీ బేసిన్‌లోని తాణేలంక, ఎదుర్లంక ప్రాంతాల్లో 2018–19 మధ్య ఆయిల్ ఇండియా సంస్థ సహజవాయువు నిక్షేపాలను కనుగొన్నట్లు రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి జవాబిచ్చారు. ఈ బావుల నుంచి సహజవాయువు వెలికితీయడం సాంకేతికంగా సవాలుగా ఉందని, ఆర్థికంగా లాభసాటిగా లేకపోవడంతో వెలికితీత కొనసాగించలేదని సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి తెలిపారు.

చంద్రబాబు ఆటలు సాగవు

అమలాపురం టౌన్: సీఎం కుర్చీ కోసం చంద్రబాబు ఎంతటి మారణ హోమానికైనా బరి తెగిస్తాడని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని శెట్టిబలిజ గ్రంథాలయంలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చేతిలో నుంచి పార్టీని చంద్రబాబునాయుడు లాగేసుకోవడమే కాకుండా అడ్డదారిలో సీఎం అయ్యాడని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు చిత్తూరు జిల్లా పుంగనూరులో అల్లర్లు, విధ్వంసాలు సృష్టించి, పోలీసులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేసి, మళ్లీ అడ్డదారిలో సీఎం అయిపోవాలని పగటి కలలు కంటున్నాడని అన్నారు. ఎన్టీఆర్ విషయంలో చంద్రబాబు ఆటలు సాగాయని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అటువంటి ఆటలు సాగవని చెప్పారు. చంద్రబాబు నాయుడికి మరోసారి పతనం తప్పదని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, వరదల వల్ల కోనసీమ లంక గ్రామాల్లో కూరగాయల పంటలకు ఏటా అపార నష్టం వాటిల్లుతోందని, ఈ నేపథ్యంలో వాటిని నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు అత్యవసరమని అన్నారు. కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వ శాఖ ద్వారా కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుపై మంగళవారం జిల్లాకు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞాపన అందిస్తామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్, అడపా రాము తదితరులు పాల్గొన్నారు.

నిన్న సాయం.. నేడు అభయం

- ముఖ్యమంత్రి జగన్ నేడు రాక
- కోనసీమ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన
- ఇప్పటికే పూర్తయిన సాయం పంపిణీ
- లోటుపాట్లు తెలుసుకొనేందుకు వస్తున్న సీఎం
- లంకల్లో బాధితులతో ముఖాముఖి



అయినవిల్లి మండలం కొండుకుదురులంక తొత్తరమూడివారిపేట వద్ద డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్లతో పోలీసుల తనిఖీలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని వరద బాధితులతో నేరుగా మాట్లాడనున్నారు. ప్రభుత్వ సాయం అందిన తీరుతో పాటు వారి ఇబ్బందులు స్వయంగా తెలుసుకుని, ధైర్యం చెప్పనున్నారు. గోదావరి నదీ కోతను పరిశీలించి, బాధితులతో మాట్లాడతారు. సీఎం పర్యటనకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యాన పక్కా ఏర్పాట్లు చేశారు. సీఎం రాక కోసం తొలిసారిగా లంక గ్రామమైన గురజాపులంకలో హెలిపాడ్ ఏర్పాటు చేయడం విశేషం.

సహాయ, పునరావాసానికే ప్రాధాన్యం

వరద గోదావరి గత నెల 22న ఉగ్రరూపం దాల్చింది. ఆ తరువాత కాస్త నెమ్మదించినా.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సుమారు 30 లంక గ్రామాలకు వరద పోటెత్తింది. లంక గ్రామాలు 10 రోజులకు పైనే ముంపులో ఉన్నాయి. ఆ సమయంలో బాధితుల పరామర్శకు వస్తే ప్రభుత్వ సహాయ, పునరావాస కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భావించారు. ముంపు బాధితులందరికీ ప్రభుత్వ సాయం అందించి, ఆదుకోవడమే ఏకైక అజెండాగా కలెక్టర్ సహా మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గతంలో మాదిరిగా మాటలు ఒకటి, చేతలు మరొకటి కాకుండా బాధితులకు తక్షణ సాయం అందించేందుకు కోనసీమ జిల్లాకు యుద్ధప్రాతిపదికన రూ.3 కోట్లు పైగా అందించారు. కేవలం నిధులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా.. గత పాలకులకు భిన్నంగా చివరి బాధితుల వరకూ సాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. వలంటీర్ల నుంచి జిల్లా అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ సీఎం ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తూ.. వరద బాధితులకు అండగా నిలిచారు.

గత పాలకులకు భిన్నంగా..

గతంలో వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో సాయం అందించినా.. అందించకున్నా సీఎం స్థాయిలోని వ్యక్తి ఆర్భాటపు పరామర్శలతో ప్రచారం చేసుకోవడం అందరికీ తెలిసిందే. ముందుగా ఎంపిక చేసుకున్న సానుభూతిపరులైన కొందరు బాధితులతో మాట కలిపి.. ఫొటోలకు పోజులిచ్చి వెళ్లిపోయే వారు. బాధితుల గోడు వినేవారు కాదు. సీఎం వెళ్లిపోయి రోజులు గడిచినా సాయం దరి చేరక కన్నీటితో ఎదురు చూసిన బాధితులు ఎంతో మంది ఉండేవారు. ఇటువంటి ప్రచారార్భాట పరామర్శలకు భిన్నంగా స్పందించిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితుల హృదయాల్లో నిలిచిపోయారు. వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం పూర్తిగా అందించిన తరువాతే ఆ ప్రాంతాల్లో పర్యటించాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ముంపు బాధితులను స్వయంగా పలకరించి, వారికి ప్రభుత్వ సాయం ఏ మేరకు అందిందో స్వయంగా తెలుసుకునేందుకు కోనసీమ జిల్లా లంకల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ సాయంపై వారు సంతృప్తిగా ఉన్నారా లేక ఇంకా ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా అనే విషయాలు తెలుసుకోనున్నారు. సాయం అందని వారు ఎవరైనా ఉన్నారా, పంట నష్టం ఏ మేరకు జరిగిందో తెలుసుకుంటారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే గ్రామాలను గుర్తించడం వరకే అధికారులు పరిమితమయ్యారు. తాను వెళ్లే మార్గంలో ఎదురుపడే బాధితులతో నేరుగా ఆయన మాట్లాడనున్నారు.

సాయం అందించారిలా..

- ముంపు తగ్గి, ట్రాక్టర్లు వెళ్లడానికి మార్గం సుగమం అయిన వెంటనే వరద బాధితులందరికీ 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపల చొప్పున అందజేశారు. అర్ధరాత్రి వరకూ కూడా ఈ సాయం పంపిణీ చేయడం విశేషం. గత పాలకుల హయాంలో ఈవిధంగా సాయం అందించడానికి నాలుగైదు రోజుల నుంచి వారం రోజులు పట్టేది.
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక ప్రకటిస్తేనే కానీ గత ప్రభుత్వ హయాంలో బాధితులకు భోజనాలు, ఆహార పొట్లాలు అందించే వారు కాదు. ఈసారి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలోనే వీటిని అందజేయడం విశేషం.
- అలాగే, బాధితులు ఒక్కరే ఉంటే రూ.వెయ్యి, ఒకరికి మించి ఉంటే రూ.2 వేల చొప్పున వెంటనే ఆర్థిక సాయం కూడా పంపిణీ చేశారు. గతంలో ఎప్పుడూ ఈవిధంగా సాయం అందించలేదని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం పర్యటన సాగనుందిలా..

- ఉదయం 9.10: రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 9.40: ముమ్మిడివరం మండలం గురజాపులంకకు రాక.
- 9.40 నుంచి 10.25: బాధితులతో మాటామంతి.
- 10.35 – 11.10: లంక ఆఫ్ ఠాణేలంక రామాలయంపేటలో బాధితులతో ముఖాముఖి.
- 11.20 – 11.50: అయినవిల్లి మండలం కొండుకుదురు తొత్తరమూడివారిపేట చేరిక. వరద బాధితులతో మాటామంతి.
- 11.50: గురజాపులంకకు పయనం.
- మధ్యాహ్నం 12.15: హెలికాప్టర్‌లో తాడేపల్లికి పయనం.

వరద బాధితులకు అందించిన సాయం

బాధిత కుటుంబాలు	:26,064
ఆహార పొట్లాలు	:86,013
వాటర్ ప్యాకెట్లు	:2,13,000
ఉచిత బియ్యం	:651.600 మెట్రిక్ టన్నులు
కందిపప్పు	:26,064 మెట్రిక్ టన్నులు
బంగాళా దుంపలు	:26.064 మెట్రిక్ టన్నులు
పామాయిల్	:26,064 లీటర్లు
ఉల్లిపాయలు	:26,064 మెట్రిక్ టన్నులు
పాలు అర లీటర్	:32,000
కొవ్వొత్తుల ప్యాకెట్లు	:1,00,000

అన్నివిధాలా ఆదుకున్నారు



ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంది. నా ఇల్లు వరదలో చిక్కుకుంది. అధికారులు వెంటనే స్పందించారు. నాకు రోజుకు రెండుసార్లు భోజనం పెట్టారు. మంచినీరు అందించారు. నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. తాత్కాలిక అవసరాలకు రూ.2 వేల నగదు సాయం చేశారు. ముంపు నష్టాలు అంచనా వేసి న్యాయం చేస్తామని అధికారులు భరోసా ఇచ్చారు.

– కొప్పాడి ధనలక్ష్మి, చింతావానిరేవు, ముమ్మిడివరం మండలం

వేగంగా స్పందించారు



వరద సహాయ చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించింది. బూరుగులంక రేవులో తాత్కాలిక రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అధికారులు తక్షణమే ఇంజిన్ బోట్లు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా రేవులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ఉంచారు. అలాగే ఇతర సహాయ కార్యక్రమాలు సైతం సకాలంలో అందించారు.

– దాసిరెడ్డి కోట సత్యనారాయణ మూర్తి, బూరుగులంక, పి.గన్నవరం మండలం

బ్యాడ్మింటన్ జూనియర్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో రజతం



రజత పతకం సాధించిన అభిషేక్

మలికిపురం: బల్గేరియన్ బ్యాడ్మింటన్ జూనియర్ ఓపెన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ అండర్–19 విభాగంలో మలికిపురానికి చెందిన యువకుడు కనపాల అభిషేక్ రన్నరప్‌గా నిలిచి, రజత పతకం సాధించాడు. ఈ వివరాలను అతడి తండ్రి రవి సోమవారం మీడియాకు చెప్పారు. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ బల్గేరియాలోని పజార్ధిజిక్‌లో ఈ పోటీలు జరిగాయన్నారు. అభిషేక్ తెలంగాణలోని నాచారం హర్షాస్ బ్యాడ్మింటన్ అకాడమీలో చీఫ్ కోచ్ పి.వికాస్ హర్ష శిక్షణలో శిక్షణ పొందాడని తెలిపారు. గతంలో మలికిపురంలోని శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీలో కూడా శిక్షణ పొందాడని చెప్పారు.

సీఎంకు ఘన స్వాగతం

- రాజమహేంద్రవరంలో స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస



రాజమహేంద్రవరంలో తమ ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఘన స్వాగతం లభించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లా గొమ్ముగూడెం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం.. హెలికాప్టర్‌లో బయలుదేరి సోమవారం సాయంత్రం 6.24 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన సీఎం హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణరెడ్డి, జి.శ్రీనివాస్‌నాయుడు, జ్యోతుల చంటిబాబు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాజమహేంద్రవరం రూరల్, సిటీ కో ఆర్డినేటర్లు చందన నాగేశ్వర్, గూడూరి శ్రీనివాస్, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, జేసీ ఎస్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డీఓ చైత్రవర్షిణి ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు.

రామేశ్వరం యాత్రా స్పెషల్

రావులపాలెం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా రామేశ్వరం స్పెషల్ యాత్రా బస్సు సర్వీస్ నడుపుతున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ సోమవారం తెలిపారు. ఏడు రోజుల ఈ యాత్ర ఈ నెల 29న మొదలై సెప్టెంబర్ 5న ముగుస్తుందని చెప్పారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ, కాణిపాకం, కాంచీపురం, శ్రీరంగం, జంబుకేశ్వర్, మధురై, రామేశ్వరం, ధనుష్కోడి, తంజావూరు, స్వామిమలై, కుంభకోణం, తిరువారూర్, తిరుకాడియూర్, చిదంబరం, శ్రీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా ఈ యాత్ర సాగుతుందన్నారు. టిక్కెటు ధర భోజనంతో కలిపి రూ.8,030 అని తెలిపారు. వివరాలకు డిపోలోని అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

10న నులిపురుగుల నివారణ దినం

అమలాపురం రూరల్: ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ఆదేశించారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఆ రోజు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. మాత్రలను ఇంటికి ఇవ్వకుండా పిల్లలతో స్వయంగా మింగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ ఐ.జాన్ లే తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వ చిహ్నం.. చేనేత రంగం



చేనేత కార్మికులను సత్కరిస్తున్న డీఆర్‌ఓ సత్తిబాబు

సాక్షి, అమలాపురం: భారతదేశ చేనేత రంగం సుసంపన్నమైన, వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలిచిందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) సీహెచ్ సత్తిబాబు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి నల్ల వంతెన వరకూ చేనేత కార్మికులతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. దీనిని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు రాజు ప్రారంభించారు. కె.జగన్నాథపురం విలసవిల్లి, బండారులంక, రంగాపురం చేనేత సంఘాల్లో విశిష్ట సేవలు అందించిన పది మంది నేత కార్మికులను డీఆర్‌ఓ ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాస్, బండారులంక చేనేత సంఘం అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కర్రెళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంపై పాక్షికంగా ఆంక్షలు సడలింపు

- అన్నవరం దేవస్థానంలో భక్తులకు మాత్రమే భోజనం పెట్టాలని ఇటీవల ఈఓ ఆదేశాలు
- దీనిపై పునరాలోచన చేయాలని కోరిన సిబ్బంది
- కొన్ని ఆంక్షలు సడలిస్తూ తాజా నిర్ణయం



అన్నదాన పథకంలో భోజనం చేస్తున్న భక్తులు



వేలిముద్ర వేసి భోజనానికి వెళుతున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యాన్న ప్రసాద పథకంలో భక్తులు మినహా మరెవరూ భోజనం చేయరాదనే ఆంక్షలను పాక్షికంగా సడలించారు. భక్తులు కాని వారు పీఆర్‌ఓ కార్యాలయం లిఖితపూర్వక అనుమతితో భోజనం చేయవచ్చని ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. రోజూ ఎంత మంది భోజనం చేస్తున్నారో తెలియడానికే గతంలో ఆంక్షలు పెట్టామని ఆయన సోమవారం మీడియాకు వివరించారు. భక్తులను మాత్రమే అన్నదాన భవనంలోకి అనుమతించాలని గత వారం ఈఓ ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై ఇతర దేవస్థానాల నుంచి వచ్చిన సిబ్బంది, కొంత మంది నాలుగో తరగతి సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆంక్షలను సడలించాలని కోరారు.

35 ఏళ్ల క్రితం ప్రారంభం

అన్నవరం దేవస్థానంలో సుమారు 35 సంవత్సరాల క్రితం అన్నదానం ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకూ భక్తులు సమర్పించిన విరాళాలు రూ.55 కోట్లు ఉన్నాయి. వీటిపై ఏటా రూ.3.50 కోట్లు వడ్డీ రూపంలో వస్తోంది. అన్నదాన పథకంలో రోజూ సరాసరిన 4 వేల మంది భోజనం చేస్తున్నారు. భోజనానికి రూ.30 చొప్పున ఏడాదికి రూ.4.5 కోట్లు ఖర్చవుతోంది. వచ్చే వడ్డీ కన్నా అదనంగా మరో రూ.కోటి ఖర్చు అవుతోంది. భక్తులు రూ.వెయ్యి కన్నా తక్కువ ఇచ్చే విరాళాలు కూడా ఖర్చు చేస్తున్నారు. వడ్డీ కన్నా అదనంగా అయ్యే రూ.కోటి ఖర్చును ఈవిధంగా భర్తీ చేస్తున్నారు.

భోజనం లేక అనేక అవస్థలు

అన్నదానంలో భక్తులకు మినహా ఇతరులకు భోజనం నిలిపివేయడంతో ఇతర దేవస్థానాల నుంచి వచ్చిన సిబ్బంది, దేవస్థానంలో తెల్లవారుజామునే విధులకు హాజరయ్యే సెక్యూరిటీ, శానిటేషన్ తదితర సిబ్బంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇతర దేవస్థానాల నుంచి అన్నవరానికి బదిలీ మీద వచ్చిన సుమారు 40 మంది సిబ్బంది ఇంతకు ముందు అన్నదానంలోనే భోజనం చేసేవారు.

సిబ్బందికి భోజనం పెట్టాలి



మా తాత గారు కర్రి భామిరెడ్డి 1940లోనే దేవస్థానానికి 40 ఎకరాలు భూమి విరాళంగా సమర్పించారు. అందులో వచ్చే పంటతో రోజుకు పది కుంచాలు బియ్యంతో అర్చకులు, పరివారానికి భోజనం పెట్టాలని ఆయన సూచించారు. అన్నదాన పథకం లేనప్పుడు అలా భోజనం పెట్టేవారు. ఇప్పుడు ఎకరానికి 35 బస్తాలు పండుతోంది. రోజూ బస్తా బియ్యంతో అన్నం వండి సిబ్బందికి పెట్టవచ్చు. అన్నదానంలో సిబ్బందికి భోజనం పెట్టే వీలు లేకపోతే ఈ విధంగానైనా భోజనం పెట్టాలని ఈఓ ని కోరతాం.

– కర్రి భామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు

ఖర్చు తగ్గించాలనే ఈ నిర్ణయం



అన్నదాన పథకంలో ఎంత మంది భక్తులు భోజనం చేస్తున్నారనే దానిపై స్పష్టత లేక ఆంక్షలు పెట్టాం. వేలిముద్ర వేసి భోజనం చేసే భక్తులతో పాటు ఇతరులు మరో 500 మంది వరకు ఉంటున్నారు. దీంతో ఎవరు భోజనం చేయాలన్నా పీఆర్వో కార్యాలయం నుంచి స్లిప్ తీసుకుని వెళ్లాలని ఆదేశించాం . ఎవరినీ ఆపమని చెప్పలేదు. దీని వలన రోజూ ఎంతమంది భోజనం చేస్తున్నారో తెలుస్తుంది. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు త్వరలో అన్నదాన పథకంలో భక్తుల ఫేస్ రీడింగ్ కూడా అమలు చేయనున్నాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ

క్లుప్తంగా

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం


హతుడు దుర్గాప్రసాద్ (పాతచిత్రం)

శంఖవరం: వివాహేతర సంబంధం నిండు ప్రాణాన్ని బలికొంది. మండలంలోని కొంతంగి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్ బాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన పగడం దుర్గాప్రసాద్(21)కు, అదే గ్రామానికి చెందిన మహిళతో రెండేళ్ల నుంచి వివాహేతర సంబంధం ఉంది. ఉపాధి నిమిత్తం భర్త దూర ప్రాంతంలో ఉండటంతో ఆ మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కొంతంగిలోని పుట్టింటికి వచ్చింది. ప్రసాద్ కూడా రాచపల్లి నుంచి ఆదివారం రాత్రి కొంతంగి వచ్చాడు. వివాహేతర సంబంధం విషయంలో అతడు అల్లరి చేయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రసాద్‌ను మేడ పైకి తీసుకువెళ్లి, కళ్లల్లో కారం కొట్టి, హతమార్చారని అతడి బంధువులు ఆరోపిస్తున్నారు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. సీఐ కిషోర్ బాబు, అన్నవరం ఎస్సై వి.కిషోర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హతుడికి తల్లి, పెళ్లి కావలసిన అన్న, చెల్లెలు ఉన్నారు.

భవనం నుంచి పడి కార్మికుడి మృతి

కొవ్వూరు: నిర్మాణంలో ఉన్న భవనానికి రంగులు వేస్తున్న ఓ కార్మికుడు కింద పడి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు కథనం ప్రకారం.. పట్టణంలోని వేములూరు రోడ్డులో అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ప్రాంతంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. భవనానికి రంగులు వేస్తున్న కొత్తమాసు నరసింహమూర్తి ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయం అవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు అచ్యుత రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫల ప్రదం

- ఏజెన్సీ సీతాఫలాలకు పెరిగిన మార్కెట్
- దివాన్ చెరువుకు తీసుకొచ్చి వ్యాపారం
- చాగల్నాడు ప్రాంతంలో తగ్గిన సాగు



రాజానగరం: సీతాఫలం.. రుచిలో ప్రత్యేకం. అందుకే అందరికీ అమితమైన ఇష్టం. ఈ మధుర ఫలాలకు ఒకప్పుడు చాగల్నాడు ప్రధాన కేంద్రం. ఇక్కడ లభించే సీతాఫలాలు రూపంలో ఆకర్షిస్తూ, రుచిలో మైమరపిస్తుంటాయి. ఈ కాలంలో వీటి కొనుగోలుకు అందరూ ఆసక్తి చూపుతుంటారు. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని చాగల్నాడు ప్రాంతంలో సీతాఫలాల సాగు చాలా వరకూ తగ్గిపోయింది. దీంతో ఏజెన్సీ సీతాఫలాలను ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం, రంగంపేట, గండేపల్లి, రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ మండలాలు చాగల్నాడు ప్రాంతంలోకి వస్తాయి. ఇక్కడ పండిన సీతాఫలాలను విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, అమలాపురం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలతో పాటు దేశ రాజధాని ఢిల్లీ వరకూ బుట్టల్లో ప్యాక్ చేసి రవాణా చేసేవారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దివాన్ చెరువు ఈ సీజన్లో సీతాఫలాల కొనుగోలు, అమ్మకందారులతో కిక్కిరిసిపోయేది. ఈ కారణంగానే ఈ ప్రాంతం పండ్ల విక్రయ కేంద్రంగా పేరొందింది. ఆ గ్రామం నేడు వివిధ రకాల పండ్ల హోల్‌సేల్ వ్యాపార కేంద్రంగా కూడా అభివృద్ధి చెందింది. దాదాపు 15 ఏళ్ల కిందట ఈ సీజన్‌లో (వంద ఫలాలు రూ.100 నుంచి రూ.150 ఉన్న రోజులు) దివాన్ చెరువు పరిసర ప్రాంతాల్లో రూ.3.5 కోట్ల వ్యాపారం జరిగేది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ ప్రభావంతో ఇక్కడ తోటలు తగ్గిపోయాయి. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి సీతాఫలాలను తీసుకువచ్చి ఇక్కడ చాగల్నాడు మార్కెట్లో విక్రయిస్తున్నారు.

జూలై నుంచి అమ్మకాలు

ఏజెన్సీలో వర్షాలు అధికంగా కురుస్తుండటంతో జూన్ నెలాఖరు నుంచి అక్కడ సీతాఫలాలు లభిస్తుంటాయి. వీటిని స్థానిక వ్యాపారులు జూలై నుంచి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తారు. అక్టోబర్ వరకూ వీటి దిగుబడి ఉండడంతో సుమారు రూ.8.50 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో చాగల్నాడు ఫలాలు లభించినప్పటికీ మార్కెట్లోకి రాకుండానే తోటలోనే వాటి అమ్మకాలు జరిగిపోతుంటాయి. ఈవిధంగా సుమారు రూ.కోటిన్నర వరకూ స్థానిక ఫలాల అమ్మకాలు ఉంటాయి.


జాతీయ రహదారిపై సీతాఫలాల విక్రయాలు

ఆ రుచే వేరు

చాగల్నాడు సీతాఫలాలపై ఆధారపడిన చిరు వర్తకులు సీజన్‌లో ఖాళీగా ఉండలేక ఈ సమయంలో ఏజెన్సీలో విరివిగా దొరికే పండ్లను ఇక్కడకు తీసుకువచ్చి, సొమ్ము చేసుకుంటున్నారు. చాగల్నాడులో పండే సీతాఫలాలు పక్వానికొచ్చిన తరువాతే చెట్ల నుంచి కోస్తారు. దీంతో ఇవి కొనుగోలుదారులను ఆకట్టుకుంటాయి. నిల్వకు పనికిరావు. ప్రస్తుతం ఏజెన్సీ నుంచి వస్తున్న సీతాఫలాలు కాయలుగా ఉండి, నిల్వకు పనికి వస్తాయి. కొనుగోలు చేసి, ఇంటికి తీసుకువెళ్లిన తరువాత ఒక్కొక్కటిగా ముగ్గుతుంటాయి. ప్రస్తుతం ఏజెన్సీ సీతాఫలాలకు దళారులు చెప్పిందే ధరగా పలుకుతోంది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకూ ఈ సీజన్‌లో సుమారు 3,500 మంది చిరు వ్యాపారులకు ఇవే జీవనాధారం. రోడ్డు పక్కన స్టాల్స్ ఏర్పాటు చేసి, కాయలను సైజుల వారీగా గ్రేడింగ్ చేసి, డజను రూ.200 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు.

అలవాటు మానుకోలేక..



సీజన్ వారీగా లభించే పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాం. సుమారు పాతికేళ్లుగా ఈ సీజన్‌లో సీతాఫలాలను విక్రయిస్తున్నాం. అలవాటైన ఈ పని వదులుకోలేక, మరో పని చేయలేక ఏజెన్సీలో సీతాఫలాలు కొనుగోలు చేసి, ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం.
– చాట్ల తాతారావు, వెలుగుబంద, రాజానగరం మండలం

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా సీతాఫలాల విక్రయాల కోసమే స్టాల్ పెట్టుకుని కూర్చుంటే దినసరి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ఏజెన్సీ నుంచి వచ్చే కాయలను దళారులు చెప్పిన ధరకు కొనుగోలు చేసినా, విక్రయించే సమయంలో ఒక్కోసారి అయినకాడికే అమ్ముకోవాల్సి వస్తోంది.
– పసల సురేష్, కలవచర్ల, రాజానగరం మండలం

స్లూయిజ్ వద్ద మృతదేహం లభ్యం

సీతానగరం: బొబ్బిల్లంక – మిర్తిపాడు మధ్యన తొర్రిగెడ్డ కల్వర్టుపై నుంచి కాలువలో పడి గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై కె.చిరంజీవి కథనం ప్రకారం.. మిర్తిపాడుకు చెందిన పీతల శ్రీనివాస్ (35) ఈ నెల 5న కల్వర్టు వద్దకు వచ్చి ఎగురుతున్న చేపలను పట్టుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలువలో పడి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న ఈత వచ్చిన ఇద్దరు వ్యక్తులు శ్రీనివాస్‌ను కాపాడేందుకు విఫల యత్నం చేశారు. రెండు రోజుల అనంతరం సోమవారం ఉదయం బొబ్బిల్లంక స్లూయిజ్ గేట్ల వద్ద శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య నళిని, ఎనిమిదేళ్ల కుమారుడు సాత్విక్ రాజు, ఆరేళ్ల కుమార్తె ఆరాధ్య, తల్లి బూసమ్మ, తమ్ముడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

ఉప్పలగుప్తం: ఎస్.యానాం వద్ద సముద్ర తీరంలోని ఉన్న కట్టు కాలువలో గల్లంతయిన చిత్రి ముఖేష్‌కుమార్ (19) మృతదేహం లభ్యమైంది. అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి కొత్త కాలనీకి చెందిన ముఖేష్ ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలసి కట్టు కాలువలో దిగి, ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. గల్లంతైన అతడి కోసం పోలీసులు, స్థానికులు వలల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మృతదేహం తేలడంతో పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలిండియా కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు రెండో స్థానం


జ్యోతికుమారికి జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వుమెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి రెండో స్థానం దక్కింది. ఉత్తర ప్రదేశ్‌లోని బహదూర్‌సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీలో జరిగిన ఈ పోటీల్లో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల విద్యార్థిని కె.జ్యోతికుమారి ద్వితీయ స్థానం సాధించి, సిల్వర్ మెడల్ అందుకుంది. వర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జ్యోతికుమారిని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు సత్కరించారు. వర్సిటీ ద్వారా రూ.20 వేల నగదు అవార్డు, సర్టిఫికెట్లు అందజేశారు. జ్యోతికుమారి క్రీడలతో పాటు ఎన్‌సీసీ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటోంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, జ్యోతికుమారి తల్లి నాగమణి, కోచ్ వి.అంజిబాబు, బాక్సింగ్ అఫీషియల్స్ సీహెచ్ చంద్రశేఖర్, ఎం.భవానీ శంకర్, పి.నాగరాజు, ఎ.ధర్మేంద్ర, స్పోర్ట్స్ బోర్డ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ బి.రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

గండేపల్లి: మండలంలోని మురారి శివారున డివైడర్ సమీపంలో విశాఖ వైపు నడచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి(45)ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది టి.అప్పారావు, ఏఎస్ స్వామి హుటాహుటిన గండేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందాడు. అతడిని ట్యాంకర్ ఢీకొని వెళ్లిపోయిందని స్థానికులు చెబుతున్నారు. మృతుడి చేతిలోని సంచిపై నర్సీపట్నం అని ఉండటంతో ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగులో ఉన్నాడు. శరీరంపై నలుపు రంగు టీ షర్ట్, లైట్ కలర్ ఫ్యాంటు ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రదేశం రాజానగరం మండల పరిధిలోకి వస్తోందని, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చామని గండేపల్లి పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు

రామచంద్రపురం: దొంగతనం కేసులో ముద్దాయిలకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించిందని ఎస్సై బి.సురేష్‌బాబు తెలిపారు. ఒక దొంగతనం కేసులో పట్టణానికి చెందిన కె.సూర్య మణికంఠ, కె.సత్యప్రభుకిరణ్‌లను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో ఏజేఎఫ్‌సీఎం జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ సోమవారం తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు. ఏపీపీ బి.రామతులసి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

టీడీపీ 'కుళ్లు' రాజకీయం

- పిఠాపురం మున్సిపల్ ఆఫీసు వద్ద చెత్త వేసిన వర్మ
- ఘాటుగా స్పందించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- వర్మ చిత్రపటానికి మురికి నీటితో అభిషేకం


మున్సిపల్ కార్యాలయంపై మురికి వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ


వర్మ చిత్రపటానికి మురికితో అభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

పిఠాపురం: టీడీపీ 'కుళ్లు' రాజకీయాలకు తెర లేపింది. నిరసన పేరుతో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ మంగళవారం మురికి కాలువల్లోని మురికి, చెత్త తెచ్చి మున్సిపల్ కార్యాలయం వద్ద వేశారు. ఈ సంఘటన పట్టణ ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. గడప గడపకూ మన ప్రభుత్వం కింద సచివాలయాలకు విడుదల చేసిన నిధులతో పట్టణంలోని మురికి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఇటీవల అధికారులను ఆదేశించారు. తక్షణమే కాలువలను గుర్తించాలన్నారు. నెల రోజులుగా మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి పర్యటించి వర్షాలకు ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి, కాలువలు మూసుకుపోయి సమస్య ఉత్పన్నమవుతోందని గుర్తించారు. ఆయా కాలువల అభివృద్ధికి పనులు చేపట్టారు.

ఏ పని చేస్తూంటే దానిపై ఆందోళన

ప్రభుత్వం ఏ మంచి పని చేసినా బురద జల్లి ఆందోళన చేయడం.. పని పూర్తి అవ్వగానే తమ వల్లేనంటూ గొప్పలు చెప్పుకోవడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారింది. ఇందులో భాగంగానే మురికి కాలువల అభివృద్ధి పనులు చేస్తూంటే.. మరోపక్క ఆ పార్టీ నాయకుడు వర్మ వార్డుల్లో తిరుగుతూ మురికి కాలువలు శుభ్రం చేయడం లేదంటూ విమర్శిస్తున్నారు. ప్రధాన కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకున్నా ఏమీ పట్టించుకోవడం లేదంటూ కాలువల మురికిని వాహనాలపై తెచ్చి స్వయంగా మున్సిపల్ కార్యాలయం ముందు వేశారు. ఎమ్మెల్యే దొరబాబుపై విమర్శలు గుప్పించారు.

మండిపడిన కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

వర్మ తీరుపై మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. బాధ్యత గల నాయకుడు ఇలా మూర్ఖంగా మురికిని తెచ్చి కార్యాయం వద్ద వేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తెచ్చిన మురికితోనే వర్మ చిత్రపటానికి అభిషేకం చేశారు. వర్మపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని నినదించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ, వర్మకు పిచ్చి ముదిరి ఇలాంటి పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఐదేళ్ల పాలనలో పట్టణ పారిశుధ్యాన్ని గాలికొదిలేశారన్నారు. మురికి తెచ్చి ఇక్కడ వేయడం నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని వైఎస్సార్ సీపీ శ్రేణులకు సర్ది చెప్పి, ఆందోళన విరమింపజేశారు.

18 మందిపై కేసు

మున్సిపల్ కార్యాలయంపై దౌర్జన్యంగా మురికి వేసిన మాజీ ఎమ్మెల్యే వర్మ సహా 18 మందిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

తల్లీబిడ్డల కోసం విస్తృత గాలింపు

- పోలీసుల అదుపులో నిందితుడు
- పెద్దమ్మకు లక్ష్మీ సాయి కీర్తన అప్పగింత


నిందితుడు ఉలవ సురేష్ (పాతచిత్రం)

అమలాపురం టౌన్/రావులపాలెం: సహజీవనం చేస్తున్న మహిళను, కుమార్తెను గౌతమీ గోదావరిలోకి తోసేసిన ఘటనలో తల్లీబిడ్డల కోసం గాలింపు కొనసాగుతోందని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ తెలిపారు. డయల్ 100 కాల్‌తో స్పందించిన పోలీసులు ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. అమలాపురంలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. తనతో సహజీవనం సాగిస్తున్న తాడేపల్లికి చెందిన మహిళ సుహాసినితో పాటు కుమార్తెలు లక్ష్మీ సాయి కీర్తన, ఏడాది పాప జెర్సీని ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఉలవ సురేష్ ఆదివారం వేకువజామున రావులపాలెం వంతెనపై నుంచి గోదావరిలోకి నిర్దాక్షిణ్యంగా తోసేసిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటనలో సుహాసిని, జెర్సీ గోదావరిలో పడి, గల్లంతవగా, కీర్తన వంతెన కేబుల్ పైపు పట్టుకుని 100 నంబర్‌కు సమాచారం ఇవ్వడం, ఆ బాలికను పోలీసులు రక్షించడం విదితమే. గోదావరిలో గల్లంతైన సుహాసిని, జెర్సీల కోసం రావులపాలెం, ఆలమూరు పోలీసులు రెండు ప్రత్యేక బోట్లతో గౌతమీ గోదావరిలో విస్తృతంగా గాలిస్తున్నారని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం నుంచీ గాలింపు సాగుతోందని, సోమవారం సాయంత్రం వరకూ వారి ఆచూకీ తెలియరాలేదని చెప్పారు. ఈ ఘాతుకానికి పాల్పడిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

పెద్దమ్మను రప్పించి..

కాగా, ఈ ఘటనలో రక్షించిన పదమూడేళ్ల లక్ష్మీ సాయి కీర్తనను పోలీసులు సోమవారం ఆమె పెద్దమ్మకు అప్పగించారు. గల్లంతైన సుహాసినికి తెనాలి చింపేటకు చెందిన పిండం సుజాత సొంత అక్క. కీర్తన ఇచ్చిన ఆధారాలతో సుజాతను రావులపాలెం రప్పించామని ఎస్సై ఎం.వెంకట రమణ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రకాశం జిల్లా దర్శికి చెందిన నిందితుడు ఉలవ సురేష్ విజయవాడ భవానీపురంలో తనకు తెలిసిన వారి వద్ద కారు అద్దెకు తీసుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. సుహాసినిని, తమ కుమార్తె జెర్సీని, ఆమె కుమార్తె లక్ష్మీ సాయి కీర్తనను ఆ కారులోనే ఎక్కించుకుని రావులపాలెం తీసుకువచ్చారని అంటున్నారు. ఆ కారు నెల్లూరుకు చెందిన ఒక వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్టు తెలుస్తోంది.


తల్లీబిడ్డల కోసం గౌతమి గోదావరిలో గాలిస్తున్న పోలీసులు

ముంపు పంటలను రక్షించుకోండిలా..

పాడి-పంట


జి.కోటేశ్వరరావు

ఆలమూరు: ఇటీవలి గోదావరి వరదలతో ముంపునకు గురైన కూరగాయ పంటలను రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే రక్షించుకోవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. దీనివలన నష్ట నివారణతో పాటు దిగుబడి దెబ్బ తినకుండా చూడవచ్చని ఆలమూరు మండల ఉద్యాన శాఖ అధికారి జి.కోటేశ్వరరావు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, కడియం, ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రాజోలు, పి.గన్నవరం, మామిడికుదురు, అల్లవరం, సఖినేటిపల్లి తదితర మండలాల్లో వాణిజ్య, కూరగాయ పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వీటిని కాపాడుకునేందుకు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కోటేశ్వరరావు సూచిస్తున్నారు.

- భూమి వాలును అనుసరించి పొలాల్లోని నీరు పోయేలా అరడుగు వెడల్పున కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. వరద నీరు ఇంకిన తరువాత నేలను పొడిగా ఆరనివ్వాలి.
- వరద నీరు ఎక్కువ రోజులు ఉంటే జింక్, పొటాష్, నత్రజని పోషకాలతో పాటు ఇనుము ధాతు లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. జింక్ లోప నివారణకు 0.2 శాతం జింక్ సల్ఫేట్, ఇనుము ధాతు లోప నివారణకు 0.2 శాతం ఫెర్రస్ సల్ఫేట్, పొటాష్, నత్రజని లోపాల నివారణకు పంట దశను అనుసరించి 0.5 శాతం నుంచి 1.0 శాతం వరకూ పొటాష్ నైట్రేట్‌ను పిచికారీ చేయాలి.
- ముంపులో చిక్కుకున్న కూరగాయ పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. రసం పీల్చే పురుగు నివారణకు 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ లేదా ప్రొఫెనోఫాస్ మందు లేక 3 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


వరద ముంపులో కూరగాయ పంటలు (పాతచిత్రం)

- టమాటాలో ఆకుముడత తెగులు నివారణకు టెబ్యుకోనజోల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయ కుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా పంటను కాపాడుకోవచ్చు.
- వంగలో మొవ్వకుళ్లు, కాండం తొలుచు పురుగు నివారణకు మూడు గ్రాముల కార్బరిల్ మందును లేదా 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుకూరల్లో ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బన్‌డైజిమ్ లేదా రెండు గ్రాముల కార్బన్‌డైజిమ్‌తో పాటు మాంకోజెబ్ మందు కలిపి లీటరు నీటిలో పిచికారీ చేయాలి.
- వరద నీరు నిల్వ వలన దొండపాదుల్లో చల్లని వాతావరణం ఏర్పడి, బూజు, బూడిద తెగుళ్లు ఆశించే ప్రమాదముంటుంది. బూజు తెగులు నివారణకు మాంకోజెబ్ లేదా మెటాలాక్సిల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు ట్రై డీమార్ఫ్ లేదా డైనోకాప్ ఒక మిల్లీలీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు


జగనన్న కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వారం రోజుల ముందుగానే పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీని ఆమె సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటించే ఈ కాలనీలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. స్వాగత ద్వారం సమీపంలో ఖాళీ స్థలాలుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ ప్రదేశంలో మూడో ఆప్షన్‌లో ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను ఒప్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నాటికి ప్రతి స్థలంలో ఇల్లు ఉండాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జేసీ ఇలక్కియ, హౌసింగ్ పీడీ పట్నాయక్, మెప్మా పీడీ ప్రియంవద, పెద్దాపురం ఆర్డీఓ జె సీతారామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.